క్లుప్తంగా

వీధిలైట్ల ఏర్పాటు



పాములపాడులో వీధి బల్బులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పాములపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో వీధి బుల్బులు ఏర్పాటు చేశారు. ఆదివారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో సర్పంచ్ చింతల నారాయణ, పాములపాడులో సర్పంచ్ మేకల భాగ్యమ్మ దగ్గరుండి బల్బులు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో బల్బులు కాలి పోయాయన్నారు. మరికొన్ని చోట్ల మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మరమ్మతు పనులు చేయించామని చెప్పారు.

20న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

నందికొట్కూరు: కర్నూలులోని అంబేడ్కర్ భవనంలో ఈ నెల 20న జరిగే రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, ఐసా జిల్లా కార్యదర్శి స్వామిదాసు నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం



వీధిలైట్లను వేయిస్తున్న సర్పంచ్ నాగమణి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని వెంగళరెడ్డి పేట గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్ నాగమణి పరిష్కరించారు. గ్రామంలో విద్యుత్ దీపాలు లేక అంధకారంలో ఉన్న పలు వీధుల్లో ఆదివారం వీధిలైట్లు వేయించారు. అలాగే డ్రైనేజీల్లో పూడికలను తీసివేయడంతో పాటు అపరిశుభ్రంగా ఉన్న వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమలు అధికంగా ఉండటంతో పాగింగ్ చేయించారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ



కబడ్డీ క్రీడాకారులతో దాత సంతోష్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన 14 మంది కబడ్డీ క్రీడాకారులకు ఆదివారం గ్రామానికి చెందిన కోట్ల సంతోష్‌కుమార్‌రెడ్డి టీషర్టులు పంపిణీ చేశారు. వీరంతా తర్ఫీదు పొంది వివిధ ప్రాంతాల్లో నిర్వహించే పోటీల్లో రాణిస్తున్నారు. వారి ప్రతిభను గుర్తించి రూ.10వేల విలువైన టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, అర్జున్‌రెడ్డి, మహేష్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కోట్ల నారాయణరెడ్డి, లక్ష్మన్న, టైలర్ కృష్ణ, మల్లి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని నాగలూటి గ్రామ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, ఎస్‌ఐ జగదీష్ ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు చేసి సారా ఊటను పట్టుకున్నామన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే తమ సెల్ నం. 94409 02585, 91772 99067, 83283 07774 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

కొనసాగుతున్న ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్, తిరుమల తిరుపతి ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు 29వ పాశురాన్ని భక్తులకు వినిపించారు. ఆయన మాట్లాడుతూ గోదాదేవి, శ్రీకృష్ణుడు గోకులంలో జన్మించుట, యాదవుల మహాభాగ్యమన్నారు. పరిపూర్ణ కల్యాణ గుణగణాలతో ప్రకాశించేది శ్రీకృష్ణ భగవానుడు అన్నారు.

గిరిజనం.. బతుకు దుర్భరం

- సమస్యల మధ్యే నలుగుతున్న గిరిజనులు
- నేటికీ పక్కా గృహాలు లేని వైనం
- ఉపాధి పనుల్లేక భారంగా మారిన కుటుంబ పోషణ
- అమలు కాని నేతల హామీలు



టార్పాలిన్ పట్టలతో నిర్మించుకున్న గృహం



నిరుపయోగంగా ఉన్న మినీట్యాంకు, మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

పాములపాడు: నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజనుల జీవనం దుర్భరంగా మారింది. నివాసానికి సరైన ఇండ్లు లేకపోవడంతో వారు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వారి జీవన శైలిలో మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వాలు నిధులు మంజూరుకే పరిమితం తప్పా ఎక్కడా అభివృద్ధి కానరాని పరిస్థితి. దీంతో నేటికి అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్న దుస్థితి నెలకొంది. శిథిలమైన ఇళ్లలోనే కాలం వెల్లదీస్తున్నారు. వారిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలంలో గిరిజన సమీకృత అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఐటీడీఏకు పూర్తిగా నిధులు కేటాయించకపోవడంతో నిర్వీర్యం అయిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని 14 మండలాల్లో 42 చెంచుగూడేలు ఉన్నాయి. 8918 కుటుంబాలు ఉన్నాయి. అందులో పాములపాడు మండలం వేంపెంట చెంచుగూడెం ఒకటి. సుమారు 50 ఏళ్ల క్రితం అటవీ ప్రాంతంలో ఉన్న చెంచులు వేంపెంట గ్రామంలో గూడెం ఏర్పాటు చేసుకున్నారు. ఈ గూడెంలో 38 కుటుంబాలు నివాసముంటున్నాయి. 2009 వరదల సమయంలో గృహాలు నెలకొరిగి శిథిలావస్థకు చేరాయి. శిథిలాల మధ్యనే.. ప్రభుత్వం అందించే టార్పాలిన్ పట్టలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. గృహాలు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇళ్ల స్థలాల కేటాయింపు

గత ప్రభుత్వం 22 మంది గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. పలు అడ్డంకులతో నిర్మాణాలకు నోచుకోలేదు. ప్రభుత్వమే ఇండ్లు కట్టించి ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు. అయితే ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దయనీయం. చెంచు గిరిజనులపై పాలకులు, అధికారులు ఏ మాత్రం శ్రద్ధ కనబరుస్తున్నారో ఈ గూడెంలోని పరిస్థితి అద్దంపడుతుంది.

కుటుంబ పోషణభారం

చెంచు గిరిజనులకు ప్రత్యేకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నెలలో 15 రోజులు పని కల్పించేవారు. అయితే చెంచు గిరిజనులను కూడా సాధారణ ఉపాధి హామీ పథకం కింద చేర్చడంతో ప్రస్తుతం వారికి పనులు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. గూడెంలో తాగునీటి మినీ ట్యాంకు నిరుపయోగంగా మారింది. చేతిపంపు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదు.

కుంటుపడిన వ్యవసాయం

ప్రభుత్వం చెంచు గిరిజనుల కోసం 42 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే 2009 వరదల్లో



చెట్ల పొదల మధ్య శిథిలమైన గృహం

కోతకు గురైంది. మట్టి తరలించాల్సిన అధికారులు అరకొరగా తరలించడంతో సాగులోకి రాలేదు. దీంతో వ్యవసాయం కూడా కుంటు పడింది. సమస్యలతో సమతమమవుతున్న గూడెం వాసుల గురించి అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి చెంచు గిరిజనుల సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇల్లు కట్టించి ఇవ్వాలి



మాకు ఇల్లు కట్టించి ఇవ్వాలి. జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు లేకపోవడంతో గుడిసెకు టార్పాలిన్ పట్టలు కట్టుకుని ఉంటున్నాం. నాకు ముగ్గురు పిల్లలు. వర్షాకాలంలో ఇంటి ముందు కూర్చోవడానికి కూడా ఉండదు. అంతా బురదగా ఉంటుంది. ఎన్ని సార్లు సారోళ్లను అడిగినా పట్టించుకోవడం లేదు.

–పులిచెర్ల అంకమ్మ, వేంపెంట చెంచుగూడెం

లోన్లు ఇవ్వాలి



నేను చేపలు పట్టడం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రభుత్వం మాకు ఏదైనా లోన్లు ఇస్తే బాగుంటుంది. కాల్వలో నీరు పోతే చేపలు పట్టలేము. ఆ సమయంలో ఇల్లు గడవడం కష్టంగా మారుతుంది. ఇంతకు ముందు ఉపాధి పనులు నెలకు 15రోజులుండేవి. ఇప్పుడు లేవు. ఎందుకో మార్చారంట. ఇంతకుముందు లెక్కనే ఉపాధి పనులు ఉంటే మాకందరికి బాగుంటుంది.

–తోట నాగరాజు, వేంపెంట చెంచుగూడెం

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని జూపాడుబంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా సులభంగా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. ఓటమి చెందితే నిరాశపడకుండా రేపటి గెలుపు కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులు గెలుపు, ఓటమిని సమానంగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి 55 టీంలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రంగనాథ్, వినయ్, నరేష్, బుజ్జి, ఇమాం తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి



కోనేరులో భక్తుల స్నానాలు

మహానంది: ఆదివారం సెలవు రోజు కావడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి, అమ్మవారికి స్థానిక అభిషేకం, కుంకుమార్చన, అష్టవిధ మహా మంగళ హారతులు, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గులపోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐ

శ్రీశైలంప్రాజెక్ట్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం సున్నిపెంటలోని భగత్‌సింగ్ కాలనీలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఆ ప్రాంత మహిళలు ముగ్గులపోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నాగరాముడు, ధనుంజయ్, బి.లక్ష్మయ్య, ఎర్రిస్వామి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి కొండపల్లి అనిత, రెండవ బహుమతి నారాయణమ్మ, మూడవ బహుమతి మోక్షితలకు సున్నిపెంట సీఐ జి.చంద్రబాబు, ఎస్‌ఐ బీవీ సుబ్బారెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, శరత్, నవీన్, శివ, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద



స్వామి వివేకానందునికి నివాళులర్పిస్తున్న అపస్,ఏబీవీపీ నాయకులు

వెలుగోడు: యువతకు స్వామి వివేకానంద ఆదర్శమని అపస్ నాయకులు అన్నెం కృష్ణార్జునరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అపస్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలన్నారు వేడుకలలో ఉదారు రామలింగారెడ్డి, కరణం రాఘవయ్య, ప్రతాప్ ఆచారి, నూలు నాగేశ్వరరావు, పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయమని ప్రగతి హైస్కూల్ కరస్పాండెంట్ రాఘవ కృష్ణ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రగతి హైస్కూల్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామారావు, సంజీవయ్య, మురళీకృష్ణ, రామసుబ్బయ్య, శ్రీధర్, మేరీ తదితరులు పాల్గొన్నారు.

మైనేని సేవలు మరువలేనివి



మైనేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పత్రిక వ్యవస్థాపకుడు మైనేని వెంకటరత్నం సేవలు మరవలేనివని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముర్తుజావలి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో మైనేని వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సమస్యలపై మైనేని చూపిన చొరవ అంతా ఇంతా కాదన్నారు. అనేక ఉద్యమాలు చేసి అందరి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, జగదీష్, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, తిరుమలయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

మైనేని వెంకటరత్నంకు నివాళి

వెలుగోడు: యూటీఎఫ్ వెలుగోడు మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు మైనేని వెంకటరత్నంకు ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్‌లు మాట్లాడుతూ మైనేని ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు గా 1975లో పత్రికను ప్రారంభించినప్పటి నుంచి ఆయన తుది శ్వాసవిడిచే వరకు (1990) పని చేశారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ నాగ స్వామి నాయక్, సీనియర్ నాయకులు రామకృష్ణ, కోశాధికారి బి సుబ్రహ్మణ్యం, జెఎండి రఫీ, ఎస్ కోటయ్య పాల్గొన్నారు.

15 నుంచి బండలాగుడు పోటీలు

పగిడ్యాల: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పడమర ప్రాతకోట నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాల సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరి విభాగంలో రూ. 600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 16న 6 పళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు(హోమ్ టీమ్స్) ఉంటాయని రూ. 400 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఒక టీంలో ఆడేవారు మరో టీంలో ఆడే అవకాశం ఉండదన్నారు. వివరాలకు 9704453115, 7995467032 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: తాండవ మల్లేశ్వరస్వామి తిరునాల సందర్భంగా మంగళవారం అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు క్యాతం శ్రీనివాసులు యాదవ్, పి.లింగారెడ్డి, బి.నారాయణరెడ్డి, శివలింగారెడ్డి, నగిరి వెంకటరమణ తెలిపారు. పోటీల్లో 6, 6 పండ్లలోపు వృషభాలు మాత్రమే పాల్గొనాలని చెప్పారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు ఈ నెల 14వ తేదీ ఉదయం 7:30లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. వివరాల కోసం 7093873824, 8247224985 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చోరీ నిందితుడికి రిమాండ్

పాములపాడు: యర్రగూడూరు గ్రామం ఎస్ఆర్ఎంసీ సమీపంలోని సుంకులమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి దేవాలయం తలుపులు పగులగొట్టి హుండీ అపహరించారన్నారు. అందులో ఉన్న రూ.15,000 నగదును ఎత్తుకెళ్లారని చెప్పారు. కాగా ఆత్మకూరు పట్టణం గరీబ్ నగర్‌కు చెందిన షేక్‌ఖాదర్ బాషా ఈ చోరీకి పాల్పడ్డాడని, బానుముక్కల మలుపు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విచారణ చేసి అతని వద్ద నుంచి రూ.15,170 రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఆత్మకూరు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు వివరించారు.

నేడు చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

జూపాడుబంగ్లా: సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం తరిగోపుల గ్రామంలో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. ఉదయం అనంతనాగేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి విశేష పూజలు జరుగుతాయన్నారు. 14న స్వామి, అమ్మవార్ల రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

మహానందిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పంచాక్షరి, మంచిర్యాల న్యాయమూర్తి ముఖేష్ మహానందికి విచ్చేశారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: మండలంలో బీసీ కులాల వారు వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల్లోపు ఉన్నవారు ఓబీఎంఎంఎస్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం ఈనెల 16వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బ్యాగులు మాయం



మహానందికి వచ్చిన బస్సు

మహానంది: హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన కొందరు భక్తులు మినీ బస్సులో ఆదివారం తెల్లవారుజామున మహానందికి వచ్చారు. శబరిమల దర్శనం పూర్తి చేసుకున్న వారు మధుర మీనాక్షి, తదితర ఆలయాలను దర్శిస్తూ మహానందికి చేరుకున్నారు. ఆలయ పరిసరాల్లో విశ్రాంతి తీసుకున్న వారు ఉదయం 6గంటల సమయంలో బస్సుపై ఉన్న బ్యాగులు కనిపించకపోవడాన్ని గుర్తించారు. దీంతోవారు మహానంది పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి బస్సు వద్దకు చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. అయితే మహానందికి వచ్చేసరికే బ్యాగులు బస్సుపైన లేవని గుర్తించారు. చాగలమర్రి టోల్‌గేట్ వద్ద, అయ్యలూరు మెట్ట వద్ద సీసీ కెమెరాలను పరిశీలించేందుకు సిబ్బందిని పంపించినట్లు పోలీసులు తెలిపారు.

ఊరెళ్లేవారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సంక్రాంతి పండగకు ఇంటికి తాళం వేసి సొంత ఊళ్లకు వెళ్లే ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన బంగారు, వెండి ఆభరణాలను, నగదును వెంట తీసుకెళ్లాలని లేదా బ్యాంకు లాకర్‌లలో భద్రపరుచుకోవాలన్నారు. ఇంటి కటాంజనము (గ్రిల్)నకు గేటుకు లోపలి వైపు నుంచి తాళం వేసుకోవాలన్నారు. ఇంటికి తాళం వేసినట్ల కనబడకుండా డోర్ కార్టన్ వేసుకోవాలని చెప్పారు. మీ ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో లైటింగ్ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ నేరాల గురించి ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సంక్రాంతి బంపర్ ఆఫర్ అని మీకు లింకులు వస్తే వాటిని క్లిక్ చేయరాదని హెచ్చరించారు. పొరపాటున క్లిక్ చేస్తే మీ ఖాతాలోని డబ్బులు ఖాళీ అవుతాయన్నారు.

దేశ భక్తి గీతాల ఆడియో ఆవిష్కరణ



ఆడియోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో కళారాధన, సాంస్కృతిక సంస్థలు, ఐఎంఏ, లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ శ్రీకృష్ణ ఆధ్యాత్మిక చానల్ రూపొందించిన శృతి సాగరం, దేశ భక్తి గీతాల ఆడియో ఆల్బంను ఆవిష్కరించారు. డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, రవికృష్ణ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వైవీఎస్ నారాయణరెడ్డి రచించిన గీతాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పవన పుత్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి సంగీత దర్శకత్వం వహించి గానం చేశారన్నారు. అన్నెం శ్రీనివాసరెడ్డి, సుధాకర్, నిజాముద్దీన్, మధుసూదన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రూ.వంద కోసం దాడి

రుద్రవరం: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లెలో రూ.వంద కోసం వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బాలరాజు,పాములేటి దాడి చేసి గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాధితుడు నిందితుల ట్రాక్టరులో కూలీ పనులకు వెళ్లేవాడు. రోజు వారీ లాగే.. ఆదివారం కూడా పనులకు వెళ్లాడు.సాయంత్రం కూలీ సొమ్ము అడగ్గా రూ.300 ఇచ్చారు. మరో రూ.వంద రావాల్సి ఉందని.. అది కూడా ఇవ్వాలని అడిగాడు. ఆ రూ.వంద కోసం వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. నిందితులు ఆగ్రహంతో కర్రతో వెంకటేశ్వర్లు తలపై కొట్టగా తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహానందీశ్వరుడికి అన్నాభిషేకం

మహానంది: మహానందిలో లోక కల్యాణార్థం మహానందీశ్వర స్వామి వారికి ఆదివారం అన్నాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు వేద మంత్రాలతో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం పూజలను అత్యంత వైభవంగా చేపట్టారు. హైదరాబాద్ వాస్తవ్యులు వారణాసి రామ్మోహన్ రావు, విజయ లక్ష్మి దంపతుల సహకారంతో అన్నాభిషేకం పూజలను నిర్వహించినట్లు ఆలయ పండితులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2007-08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత స్నేహితులను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు అధ్యక్షతన అప్పటి ఉపాధ్యాయులను పిలిపించి ఘనంగా సన్మానించారు. తమ ఉన్నతికి ఎంతగానో పాటుపడిన ఉపాధ్యాయుల కృషి మరువలేమని విద్యార్థులు కొనియాడారు.

ఆత్మీయ సమ్మేళనం

మహానంది: మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



ఒకే చోట కలిసిన పూర్వ విద్యార్థులు